మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన తుంగ బాలు

యాదాద్రి భువనగిరి, జనవరి 11 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేసీఆర్‌ను, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పూల బొకే అందించారు.

మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌తో బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు

సంక్షేమ పథకాలు పారదర్శకంగా అమలు చేయాలి

- కలెక్టర్ హనుమంతరావు

కలెక్టర్ కార్యాలయంలో వడ్డె ఓబన్న చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 11 : రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు తదితర పథకాలు పారదర్శకంగా అమలు చేసేందుకు జాబితా ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్‌తో కలిసి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా పథకంలో అర్హులైన రైతుల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పేర్లను జాబితాలో చేర్చాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందించడానికి అవసరమైన జాబితాను సిద్ధం చేయాలని తెలిపారు. ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్న రేషన్ కార్డుల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ప్యూరిఫికేషన్ ప్రక్రియ 15వ తేదీ నుంచి ప్రారంభించి, 16 నుంచి 20 వరకు ఫీల్డ్ వెరిఫికేషన్ పనులు పూర్తి చేయాలని చెప్పారు. 21 నుంచి 24 వరకు గ్రామ సభలు నిర్వహించి, పథకాల మీద డప్పు చాటింపు వేయాలన్నారు. సమావేవంలో జడ్పీ సీఈఓ శోభారాణి, భువనగిరి, చౌటుప్పల్ రెవెన్యూ డివిజనల్ అధికారులు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్, జిల్లా పంచాయతీ అధికారి సునంద, ఎంపీడీఓలు, తాసీల్దార్లు, ఏడీఏ, ఆర్ఐలు పాల్గొన్నారు.

ఓబన్న వీరోచిత పోరాటం భావి తరాలకు ఆదర్శం

భువనగిరి కలెక్టరేట్ : స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న వీరోచిత పోరాటం భావితరాలకు చాటి చెప్పాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశం మందిరంలో శనివారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వడ్డె ఓబన్న 218వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఓబన్న 1840 సంవత్సరంలో ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రవేశపెట్టిన భూమి శిస్తు విధానానికి వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని లేవదీశారన్నారు. జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జడ్పీ సీఈఓ శోభారాణి, ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి యాదయ్య, జిల్లా అధికారులు, ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఢిల్లీలో సత్తా చాటిన మోడల్ స్కూల్ విద్యార్థులు

- జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలకు ఎంపికైన చార్జింగ్ ఎలక్ట్రిక్ నానో ట్రాక్టర్ ప్రాజెక్టు
- చిన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా తయారీ
- రాష్ట్రం తరపున జాతీయ స్థాయికి ఎంపికైన ఏకైక ప్రాజెక్టు

విద్యార్థులు తయారు చేసిన చార్జింగ్ ఎలక్ట్రిక్ నానో ట్రాక్టర్

తుర్కపల్లి, జనవరి11 : ఢిల్లీలోని భారతి మండపంలో శనివారం నిర్వహించిన జాతీయ స్థాయి వికసిత్ భారత్ సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలకు తుర్కపల్లి మండలం రాంపురం గ్రామంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన చార్జింగ్ ఎలక్ట్రిక్ నానో ట్రాక్టర్ ప్రాజెక్టు ఎంపికైంది. పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు లూనావత్ అఖిల్, భానోతు తరుణ్ పాఠశాల ఉపాధ్యాయులు, గైడ్ కొట నవీన్ సహకారంతో గత కొంత కాలంగా శ్రమించి తయారు చేసిన చార్జింగ్ ఎలక్ట్రిక్ నానో ట్రాక్టర్‌ను విద్యార్థులు ఢిల్లీలోని భారత్ మండపంలో ప్రదర్శించారు. చిన్న సన్నకారు రైతులకు అతితక్కువ పెట్టుబడితో వ్యవసాయానికి ఉపయోగపడే విధంగా ఈ ట్రాక్టర్‌ను రూపొందించారు. దీని సహయంతో చిన్నకారు రైతులకు మెట్టభూముల దున్నకం, కలుపు తీయడం, పురుగుల మందు స్ప్రే చేసేందుకు, అంతరపంటల నిర్వహణ ,మామిడి తోటల్లో పంట సేకరణ వంటి పనులకు ఎంతగానో ఉపయోగపడనుంది. కాగా సెప్టెంబర్ 2024లో భువనగిరి జిల్లా కేంద్రంలో జిల్లాస్థాయి పోటీలో పాల్గొని ఈ ప్రాజెక్టు రాష్ట్రస్థాయికి ఎంపికైంది. జనవరి7న హైదరాబాద్‌లో నిర్వహించిన నేషనల్ యూత్ ఫెస్టివల్ రాష్ట్రస్థాయి పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి 33 ప్రాజెక్టులు పాల్గొనగా అందులో తుర్కపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు రూపొందించిన నానో ట్రాక్టర్ ఏకైక ప్రాజెక్టు ఎంపికైంది. ఢిల్లీలోని భారత్‌మండపంలో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 10 ప్రాజెక్టులు పాల్గొనగా అందులో రాష్ట్రం నుంచి మోడల్ స్కూల్ విద్యార్థులు తయారు చేసిన నానో ట్రాక్టర్ ప్రాజెక్టును విద్యార్థులు ప్రదర్శించారు.

జాతీయ స్థాయి ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

'టీటీడీ ఉద్యోగికి యాదగిరి గుట్ట నుంచి వేతనం ఇవ్వద్దు'

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట, జనవరి11 : టీటీడీ దేవస్థానంలో లైజన్ ఆఫీసర్‌గా నియమించిన ఉద్యోగికి యాదగిరి గుట్ట దేవస్థాన నిధుల నుంచి వేతనం చెల్లింపు ఉత్తర్వులు ఉపసంహరించుకునేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు కోరారు. శనివారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసి వినతి పత్రం అందజేశారు. దేవస్థానానికి వచ్చిన ఆదాయం స్వామివారి ఆలయానికే ఖర్చు చేయాలని, ఇలా ఇతర రాష్ట్రంలోని దేవాలయంలో పనిచేసే ఉద్యోగి వేతనానికి కేటాయించడం సరైంది కాదన్నారు. ఆయన వెంట సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కళ్లెపల్లి మహేందర్ తదితరులు ఉన్నారు.

స్వపరిపాలన దినోత్సవం

ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించిన విద్యార్థులు

బొమ్మలరామారం, జనవరి 11 : మండల కేంద్రంలోని మాతృశ్రీ హైస్కూల్‌లో విద్యార్థులు శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, అధికారులుగా పాఠశాల విధులు నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీశైలం, ఉపాధ్యాయులు విశ్వరూపం, జమున, విద్యార్థులు దిలీప్, శ్రీహంత్, ఉదయ్, ప్రణయ్‌వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆఫీసుపై దాడి సిగ్గుమాలిన చర్య

- కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతను ఎత్తిచూపితే దాడులా?
- ముక్తకంఠంతో ఖండించిన బీఆర్‌ఎస్ నాయకులు

మోత్కూరు : సమావేశంలో మాట్లాడుతున్న మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి తదితరులు

బీబీనగర్, జనవరి 11 : బీఆర్‌ఎస్ జిల్లా ఆఫీసుపై కాంగ్రెస్ గూండాల దాడి సిగ్గుమాలిన చర్య అని ఆ పార్టీ బీబీనగర్ మండలాధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాసులు అన్నారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కోరారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు ప్రశ్నించిన వాటిపై సమాధానం చెప్పలేక దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ పాలనకు పరాకాష్ట అన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ ప్రధాన

రాజాపేట : మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్

కార్యదర్శి చింతల సుదర్శన్‌రెడ్డి, మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు మంచాల రవి కుమార్, నాయకులు గుంటిపల్లి లక్ష్మీనారాయణ, బాషబోయిన బాలప్రసాద్, జక్కి నగేశ్, దొంతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పచ్చిమట్ల వంశీ, జగదీశ్, అల్వాల కాటమయ్య, పంజాల సతీశ్‌గౌడ్, పంజాల బాల్‌రాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పాలన అంటే దాడులా : బీఆర్‌ఎస్ రాజాపేట మండలాధ్యక్షుడు తిరుమలేశ్

రాజాపేట : కాంగ్రెస్ సర్కార్ ప్రజా పాలన అంటే దాడుల పాలనా అని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్ అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల జోలికి వస్తే ఖబడ్దార్ అని, ప్రతి దాడులు తప్పవని హెచ్చరించారు. కాంగ్రెస్ పిట్ట బెదిరింపులకు బెదిరేది లేదని, బీఆర్‌ఎస్ కార్యకర్తలు కన్నెర్ర చేస్తే గ్రామాలలో కాంగ్రెస్ కార్యకర్తలు తిరిగే పరిస్థితి ఉండదన్నారు. సమావేశంలో మదర్ డెయిరీ మాజీ డైరెక్టర్ చింతలపూరి వెంకటరామిరెడ్డి, నాయకులు గుంటి మధుసూదన్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, ఎర్రగోకుల జస్వంత్, యాదగిరిగౌడ్, గొడుగు రాజు బాలకృష్ణ తదితరులున్నారు.

ప్రజా పాలన, ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా ? : గుండాల మాజీ జడ్పీటీసీ కోలుకొండ లక్ష్మీరాములు

గుండాల : బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంపై కాంగ్రెస్ నాయకుల దాడి హేయమైన చర్య అని మాజీ జడ్పీటీసీ కోలుకొండ లక్ష్మీరాములు అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని శనివారం ఆమె ప్రకటనలో ఖండించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు మీలా దాడులు చేస్తే ఈ రోజు మీరు మిగిలేవారు కాదని అన్నారు. బీఆర్‌ఎస్‌ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేకనే కాంగ్రెస్ పార్టీ దాడులకు పాల్పడుతున్నదని తెలిపారు. ప్రజా పాలన, ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా అని ఆమె ప్రశ్నించారు.

కాంగ్రెస్ గూండాలను అరెస్ట్ చేయాలి : బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య

మోటకొండూర్ : బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంపై దాడికి పాల్పడిన కాంగ్రెస్ గూండాలను వెంటనే అరెస్ట్ చేయాలని ఆ పార్టీ మోటకొండూర్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది కాకుండానే ప్రజా సమస్యలు పరిష్కరించకుండా ఇలా దాడులు చేయడం పద్ధతి కాదని హెచ్చరించారు. పార్టీ మండల ప్రధానకార్యదర్శి ఎగ్గిడి కృష్ణ, గ్రామశాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ భూమండ్ల యాదయ్య, నాయకులు రేగు చంద్రం, దడిగే మధు, బొలగాని లక్ష్మీనారాయణ, కాదూరి ఎల్లేందర్, బొట్ల ప్రశాంత్, రాజు, మహేశ్ తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడి హేయమైన చర్య

మోత్కూరు : భువనగిరిలోని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంపై కాంగ్రెస్ గుండాల దాడి హేయమైన చర్య అని మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పొన్నెబోయిన రమేశ్ అన్నారు. మోత్కూరు పట్టణ కార్యాలయంలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని అడిగినందుకు బీఆర్‌ఎస్ కార్యాలయంపై దాడి చేయడం పిరికి పంద చర్య అన్నారు. గత పదేండ్ల బీఆర్‌ఎస్ హయాంలో కాంగ్రెస్ నాయకులు చేసిన అరోపణలకు బీఆర్‌ఎస్ ఇలాంటి దాడులకు పాల్పడితే రాష్ట్రంలో ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడు కూడా బయట తిరిగే వాళ్లుకాదని తెలిపారు. అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను, ఎన్నో ఉద్యమాలు చేసి రాష్ట్రాన్ని సాధించిన బీఆర్‌ఎస్‌కు తరిమి కొట్టడం లెక్క కాదన్నారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ తీపిరెడ్డి మేఘారెడ్డి, అడ్డగూడూరు మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్ష, కార్యదర్శులు జంగ శ్రీను, గజ్జి మల్లేశ్, మాజీ సర్పంచ్ బయ్యని పిచ్చయ్య, నాయకులు కొండ సోంమల్లు, విష్ణుమూర్తి, దాసరి తిరుమలేశ్, నరేశ్, మత్స్యగిరి, విద్యాసాగర్, శ్రీను పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలని అడిగితే దాడులు చేస్తారా ? : బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్

భువనగిరి కలెక్టరేట్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడిగితే దాడులకు పాల్పడడం సిగ్గుమాలిన చర్య అని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. శనివారం భువనగిరిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక కాంగ్రెస్ పార్టీ

మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్

నాయకులు భౌతిక దాడి చేయడంతోపాటు, పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేయడం దుర్మార్గమని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి దాడులు సహించరానిదని తెలిపారు. దాడులకు పాల్పడిన కాంగ్రెస్ శ్రేణులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఎన్ఎస్‌యూఐ దాడిని సహించేది లేదు : బీఆర్‌ఎస్

చౌటుప్పల్ : భువనగిరిలోని బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంపై ఎన్ఎస్‌యూఐ నాయకులు చేసిన దాడిని సహించేదిలేదని బీఆర్‌ఎస్ యువజన నాయకులు ఉప్పు కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది కాంగ్రెస్ పార్టీ అరాచక పాలనకు నిదర్శనమని ఆయన మండిపడ్డారు. తక్షణమే దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని అధికారులను కోరారు.

మోటకొండూర్ : మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య

బీబీనగర్ : మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షు రాచమల్ల శ్రీనివాసులు

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

బొమ్మలరామారం, జనవరి 11 : మండలంలోని మల్యాల ఆదర్శ పాఠశాలలో 6 నుంచి 10 వ తరగతి చదివేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎమామ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసే విద్యార్థులు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు తీసుకొని ఈ నెల 11నుంచి ఫిబ్రవరి 25 వరకు సమీప మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

టీవీఎస్‌ను ఢీ కొన్న కారు.. వ్యక్తి మృతి

వలిగొండ, జనవరి11 : టీవీఎస్ ద్విచక్రవాహనాన్ని కారు ఢీ కొనడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని అక్కంపల్లి గ్రామ స్టేజీ వద్ద చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అక్కంపల్లి గ్రామానికి చెందిన నారి మల్లయ్య(65) శనివారం ఉదయం ఇంటి నుంచి టీవీఎస్ వాహనంపై తన వ్యవసాయ బావివద్దకు వెళ్తుండగా భువనగిరి నుంచి వలిగొండ వైపునకు వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో నారి మల్లయ్య తీవ్రంగా గాయపడి అక్కడిక్కక్కడే మృతి చెందాడు. పోలీసులు మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట దవాఖానకు తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

నిత్యావసర వస్తువులు అందజేత

ఆత్మకూరు(ఎం), జనవరి11 : మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన రాగిర్ అంజయ్యగౌడ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబానికి మల్లికార్జున కిరాణం, జనరల్ స్టోర్ నిర్వాహకులు శిగ లక్ష్మీమల్లేశంగౌడ్ నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరస్వామి, మల్లేశం, సత్యనారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు అందజేస్తున్న దాతలు

కంచర్ల రామకృష్ణారెడ్డి ఇంటి వద్ద బందోబస్తు

మోత్కూరు : దత్తప్పగూడెంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి ఇంటి వద్ద పహారా కాస్తున్న పోలీసులు

మోత్కూరు : బీఆర్‌ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ గూండాల దాడి నేపథ్యంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి స్వగ్రామం మండలంలోని దత్తప్పగూడెంలో పోలీసులు శనివారం బందోబస్తును నిర్వహించారు. రాచకొండ సీపీ ఆదేశాల మేరకు రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో ఎస్ఐ డి.నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు.

క్రీడా సైనికులకు స్ఫూర్తి పూల నాగయ్య

నాగయ్య దంపతులను సత్కరిస్తున్న దాసరి మంజుల, ఉపాధ్యాయులు

ఆలేరు టౌన్, జనవరి 11 : జిల్లాలో ఎంతో మంది క్రీడా ప్రావీణ్యం కలిగిన క్రీడా సైనికులను తయారు చేయడంలో సఫలీకృతుడై తోటి ఉద్యోగులకు పీడీ పూల నాగయ్య స్ఫూర్తిగా నిల్చారని ప్రధానోపాధ్యాయురాలు దాసరి మంజుల అన్నారు. ఆలేరు పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం జరిగిన నాగయ్య పదవీ విరమణ వీడ్కోలు సభలో ఆమె మాట్లాడారు. నాగయ్య క్రమశిక్షణ, నిబద్ధతతో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించారని కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగి మంద సోమరాజు, ఆత్మీయ మిత్రులు వట్టెపు వెంకటేశ్వర్లు, వట్టెపు కుమార్, పోరెడ్డి రంగయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలలో సంక్రాంతి సంబురాలు

విద్యార్థుల తలలో భోగి పండ్లు వేస్తున్న ఉపాధ్యాయులు

భూదాన్‌పోచంపల్లి, జనవరి 11 : పట్టణ కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో ముందస్తుగా భోగి, సంక్రాంతి సంబురాలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో రంగవల్లులతో అందంగా తీర్చిదిద్దారు. చిన్నారులు ఆనందోత్సాహలతో గాలిపటాలు ఎగరవేయగా భోగి మంటలు వేసి నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో లిటిల్ ఫ్లవర్ పాఠశాల కరస్పాండెంట్ చెరుకు లింగస్వామి, ఉపాధ్యాయులు కళావతి, ఉమా, అర్చిత, కుసుమాంజలి, వెన్నెల, సంధ్యారాణి, ధనలక్ష్మి, స్పందన, స్వప్న, భానుచంద్రిక, కీర్తన, సంతోష, మేఘమాల, అంజలి, పావని, దీపన, అనురాధ, రమ్య విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

రేవంత్‌ను సీఎంగా ప్రజలే గుర్తిస్తలేరు

- హామీలు అమలు చేయకుండా తప్పుదోవ పట్టిస్తున్న ప్రభుత్వం
- కాంగ్రెస్ వచ్చి ఏ పనులు చేసిందో చెప్పాలి
- అసంపూర్తిగా ఉన్న పనులు చేసి తామే చేశామని చెప్పుకోవడం విడ్డూరం
- భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి అర్బన్, జనవరి 11 : ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయక పోవడంతో ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేఖతను చూసి సీఎం రేవంత్‌రెడ్డి పొంతనలేని మాటలు మాట్లాడుతున్నారని, రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ప్రజలు గుర్తిస్త లేరని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. భువనగిరి పట్టణంలోని బీఆర్‌ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డితో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, ఏదో ఫోన్ ట్యాపింగ్, ఇతర అంశాలను లేవనెత్తి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌లో తన పేరు రావడం హస్యాస్పదంగా ఉందన్నారు. అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి ఎప్పుడేం మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదని, మాటలు మార్చే విధానాన్ని చూసి ప్రజలు అసహించుకుంటున్నారని తెలిపారు. ఎన్నికల ముందు రైతుభరోసా రూ.15 వేలు ఇస్తామని ఇప్పుడు రూ.12వేలకు మార్చడం, అది కూడా పలు తేదీల్లో ఇస్తామని పొడిగించడంతో ప్రజలు రేవంత్‌రెడ్డిని నమ్మ పరిస్థితి లేదని చెప్పారు. రైతు భరోసా ఈనెల 26 నుంచి ఇస్తామని అన్నారు, కానీ అనువైన భూమికి ఇస్తామన్నారని, అది ఎలా సాధ్యపడుతుందో వారికే తెలువదని అన్నారు. ఏ భూమికి ఇస్తారో ఎప్పుడు సర్వేలు చేస్తారో, ఏ ఏ భూములకు ఇవ్వరో, రైతులకు ఎంత, కౌలు రైతులకు ఎంతనని ఇచ్చే స్పష్టత ఆయనకే స్పష్టత లేదని తెలిపారు. నియోజకవర్గానికి కాళేశ్వరం నీళ్లను బీఆర్‌ఎస్ పార్టీనే తెచ్చిందని, అప్పుడే చెరువులు నింపామని చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో అసంపూర్తిగా ఉన్న పనులు చేసి కాంగ్రెస్ పాలనలో జరిగిందని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని, ఈ విషయం ప్రజలందరికీ తెలుసుని అన్నారు. కాంగ్రెస్ వచ్చి సంవత్సరమైనా కొత్తగా ఏం చేశారో చెప్పాలన్నారు. కొత్తపనులు ఏం లేవని, బీఆర్‌ఎస్ చేయగా మధ్యలో ఆగిన పనులు పూర్తి చేస్తే ప్రజలకు సంతోషిస్తారని అన్నారు. గతంలోనే హన్మాపురం విద్యుత్ లైన్, శామీర్‌పేట్ నుంచి వడపర్తి కత్వా ద్వారా భువనగిరి వచ్చే అసంపూర్తిగా ఉన్న కాల్వను పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా పట్టణంలో ఫుట్‌పాత్ స్లైడింగ్, భువనగిరి, బీబీనగర్ చెరువుల సుందరీకరణను అడ్డుకోకుండా వెంటనే మినీ ట్యాంకుబండ్‌ల నిర్మాణంపై దృష్టి పెట్టాలని అన్నారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇండ్లు, రోడ్ల మరమ్మతులు పూర్తి చేయాలని తెలిపారు.

కాంగ్రెస్‌ది కక్షపూరిత పాలన : బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి

ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయక నియంత, కక్షపూరిత పాలన చేస్తున్నదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన 13 నెలల్లో కాంగ్రెస్ ఏం చేసిందో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. లగచర్ల రైతులు, మాజీ ఎమ్మెల్యే పట్నం మహేందర్‌రెడ్డిపై కేసులు పెట్టడం కక్ష సాధింపులో భాగంగా చేశారని అన్నారు. ఏడాదిన్నరలోపే ప్రజల్లో ఇంత వ్యతిరేఖత రావడం రేవంత్‌రెడ్డిపై, ఆ నియోజకవర్గాల్లో ఆ పార్టీ ఎమ్మెల్యేలు చేస్తున్న దండుకోవడాలను చూస్తే తెలుస్తుందని చెప్పారు. ఆలేరు ఎమ్మెల్యే భూదందాల్లో ఒకే రోజు ఎలాంటి పర్మిషన్లు లేకుండా 154 రిజిస్ట్రేషన్లు చేశాడని, ఆ అధికారి సస్పెండ్ కావడం నిజం కాదా అని ప్రశ్నించారు. ఈ విషయంపై బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే ప్రశ్నిస్తే చేసేది లేక కౌంటర్ ఇవ్వడం సిగ్గుచేటన్నారు. తుంగతుర్తిలోని జాజిరెడ్డిగూడెం, వంగమర్తిలో రోజుకు 400 ఇసుక లారీలు యథేచ్ఛగా పోతుంటే ఎమ్మెల్యే మందుల సామేల్ ఏంచేస్తున్నాడని, ఇదంతా ఆయన చేయిస్తుండడంతోనే ప్రజల్లో వ్యతిరేఖత వచ్చిందని తెలిపారు. కేసీఆర్‌ను తిట్టకుండా, కేసీఆర్ పదాన్ని ఉచ్చరించకుండా రేవంత్‌రెడ్డి ఒక్క సభ పెట్టలేదన్నారు. ముఖ్యమంత్రి స్థాయిని మరిచి పోయి మాట్లాడడం సరికాదని తెలిపారు. ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేఖ విధానాలను కొనసాగిస్తే గద్దెదించేవరకూ పోరాడుతామని రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. ఈ సమావేశంలో జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ జడల అమరేందర్, మాజీ రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు కొలుపుల అమరేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఎడ్ల సత్తిరెడ్డి, మాజీ జడ్పీటీసీ బీరు మల్లయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జనగాం పాండు, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ర్యాకల శ్రీనివాస్, తాడెం రాజశేఖర్, సత్యనారాయణ, నాగారం సూరజ్, పెంట నితీశ్, ఎ.జహంగీర్, చిలువేరు మధు, పోల ప్రవీణ్‌కుమార్, తాడూరి భిక్షపతి, ఇక్బాల్ చౌదరి, కట్కూరి జంగయ్య, బాత్క అశోక్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తదితరులు

క్యాలెండర్ ఆవిష్కరణ

యాదగిరిగుట్ట, జనవరి11 : బీఆర్‌ఎస్ పార్టీ యాదగిరి గుట్ట పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్లెం స్వాతి రూపొందించిన 2025 క్యాలెండర్‌ను శనివారం స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. క్యాలెండర్లను పలువురికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో యాదగిరిగుట్ట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, వివిధ మండలాల అధ్యక్షులు గంగుల శ్రీనివాస్, బీసు చందర్‌గౌడ్, సట్టు తిరుమలేశ్, బొట్ల యాదయ్య, పీఏసీఎస్ చైర్మన్లు ఇమ్మడి రామిరెడ్డి, మొగులగాని మల్లేశ్‌గౌడ్, మాజీ జడ్పీటీసీలు తోటకూరి అనూరాధ, ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకర్, మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ కళ్లెం స్వాతి, బాలయ్య పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన రామానంద సంస్థ చైర్మన్



భూదాన్‌పోచంపల్లి, జనవరి 11 : స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ చైర్మన్‌గా నియమితులైన నారా కిశోర్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంకు బొకే అందించి కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. చౌప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఉన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ముక్తాపూర్‌లో జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ కొంగరి కృష్ణ

భూదాన్‌పోచంపల్లి, జనవరి 11 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని రెండో వార్డు కౌన్సిలర్ కొంగరి కృష్ణ అన్నారు. పోచంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, యూనిట్ 2, ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శీతాకాల శిబిరంలో భాగంగా శనివారం ఆయన జెండా ఊపి పచ్చదనం పరిశుభ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ముక్తాపూర్ చెన్నకేశవ స్వామి గుడి సమీపంలో ఉన్న సాయిబాబా మందిరం పరిసరాల్లో, చింత బావి గ్రామంలో వీధుల రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు దుర్గం సాయివర్ధన్, వి.జ్యోతి, కళాశాల అధ్యాపకులు సంతోష్, వెంకట్‌రెడ్డి, నాయకులు ఇటముని లక్ష్మయ్య, ముద్దం నరసింహ, రుద్ర వీరస్వామి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.